సాక్షి విశాఖపట్నం

గురువారం । 19 । జనవరి । 2023



పదిలమైన ప్రణాళిక

10వ తరగతి పరీక్షలకు సన్నద్ధత 8లో



భద్రతకు భరోసా

• మహిళలు, బాలలు, రోడ్ సైబర్ సేఫ్టీపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి 8లో



బరువెక్కిన గుండెలతో..

దివంగత ఆడారి తులసీరావుకు ఘన నివాళి 8లో

న్యూస్‌రీల్

20 నుంచి దూరవిద్య డిగ్రీ పరీక్షలు

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం పరిధిలో డిగ్రీ ప్రథమ సంవత్సరం పరీక్షలు ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. బీఏ, బీకాం, బీఎస్సీ ప్రథమ సంవత్సరం పరీక్షలకు మొత్తం 12,041 మంది దరఖాస్తు చేసుకున్నారు. 4,101 మంది విద్యార్థులు బీఏ కోర్సుకు, 3,019 మంది బీకాం కోర్సుకు, 4,921 మంది విద్యార్థులు బీఎస్సీ కోర్సుకు హాజరవుతారన్నారు.

పరీక్ష కేంద్రాల్లో స్వల్ప మార్పులు

పరీక్ష కేంద్రాల్లో స్వల్ప మార్పులు చేసినట్లు దూరవిద్య కేంద్రం సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వరరావు తెలిపారు. నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజాం శ్రీ జీసీఎస్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో, విజయనగరం ఏజీఎల్ కళాశాల విద్యార్థులు ఎం.ఆర్ అటానమస్ కళాశాలలో, బొబ్బిలి రాజా ఆర్ఎస్ఆర్‌కె రంగారావు డిగ్రీ కళాశాల విద్యార్థులు సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, విశాఖపట్నం ఎంవీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు గాజువాక టీఎస్ఆర్-టీబీకే డిగ్రీ కళాశాలలో, అమలాపురం ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు, కాకినాడ రాజీవ్ గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ సైన్స్‌లో హాజరు కావాలన్నారు. వివరాలకు 0891 2844163, 2754966 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నీటి నాణ్యత పర్యవేక్షణ ప్రాజెక్ట్ ప్రారంభం



సముద్ర తీరంలో ఏర్పాటు చేసిన బూయె

ఏయూక్యాంపస్: సముద్ర నీటి నాణ్యతను గణించే ప్రత్యేక పరిశోధన ప్రాజెక్ట్‌ను బుధవారం ఏయూ ప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కోస్టల్ రీసెర్చ్‌తో సంయుక్తంగా ఈ ప్రాజెక్ట్ నిర్వహిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సాంకేతిక పరికరం(బూయె)ను సాగర్‌తార కోస్టల్ రీసెర్చ్ వెసల్(చెన్నై) నిపుణుల బృందం ఆర్.కె బీచ్ వద్దనున్న ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న తీర ప్రాంతంలో విడిచిపెట్టింది. దీని సహాయంతో నీటి నాణ్యతను పర్యవేక్షిస్తారు. సముద్ర నీటిలో ఉష్ణోగ్రత, పీహెచ్, లవణీయత, డిజాల్వ్‌డ్ ఆక్సిజన్, క్లోరోఫిల్ వంటివి గణిస్తారు. కార్యక్రమంలో ఎన్‌సీసీఆర్ నిపుణులు డాక్టర్ పి.మిశ్రా, డాక్టర్ శివాజీ పాత్ర, డాక్టర్ బి.చరణ్‌కుమార్, ఏయూ ఆచార్యుడు డాక్టర్ పి.జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్ల పరిశీలన

డొండపర్తి(విశాఖ దక్షిణ): పోలీస్ కానిస్టేబుళ్ల నియామకాల్లో భాగంగా ఈ నెల 22వ తేదీన పరీక్ష జరగనున్న దృష్ట్యా ఆయా కేంద్రాల్లో ఏర్పాట్లను డీసీపీ-1 సునీల్ సుమిత్ గరుడ్ బుధవారం పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం 6,100 పోలీస్ కానిస్టేబుళ్లు, 411 సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల రిక్రూట్‌మెంట్‌కు నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో భాగంగా ఈ నెల 22వ తేదీన కానిస్టేబుళ్లకు ప్రిలిమినరీ/స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నారు. డీసీపీ-1 స్క్రీనింగ్ పరీక్షకు ఎంపిక చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను, పరీక్షా కేంద్రాలను సందర్శించి అక్కడ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పాలిమర్స్ టెక్నాలజీలో ఉచిత శిక్షణ

ఎన్టీపీసీ ప్రభావిత ప్రాంత యువతకు అవకాశం

అక్కిరెడ్డిపాలెం(గాజువాక): ఎన్టీపీసీ, సింహాద్రి సౌజన్యంతో భారత ప్రభుత్వ సంస్థ సీపెట్‌టీ 60 మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనతో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సీఎస్‌టీఎస్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్.శేఖర్ తెలిపారు. అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో ఎన్టీపీసీ సింహాద్రి ప్రాజెక్ట్ ప్రభావిత గ్రామాల్లో స్థానికంగా ఉండి, 10వ తరగతి విద్యార్హతతో 18 నుంచి 30 ఏళ్ల వయసు కలిగిన వారు శిక్షణకు అర్హులన్నారు. ఎంపికైన వారికి విజయవాడలో ఆరు నెలల పాటు పాలిమర్స్ టెక్నాలజీలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం వారికి సర్టిఫికెట్‌తో పాటు విశాఖపట్నం, అనంతపురం, హైదరాబాద్, బెంగళూరు, హోసూర్, చెన్నై తదితర ప్రాంతాల్లో ప్లాస్టిక్, అనుబంధ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయాలతో పాటు నెలకు రూ.3 వేల స్టైఫండ్ అందిస్తామన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీయువకులు సీపెట్‌టీ ప్రతినిధి బాణావతు అంజి నాయక్ లేదా 78935 86494కు సంప్రదించవచ్చు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఈ నెల 27వ తేదీలోపు పూర్తి చేసుకోవాలని శేఖర్ సూచించారు.

హెల్మెట్ ఉల్లంఘనులు

- నిబంధనలు పాటించని వాహనాలపై 13,771 కేసులు
- వీటిలో 7,994 మంది హెల్మెట్లు ధరించని వారే..
- రెండో స్థానంలో లైసెన్స్ లేకుండా నడిపిన వారు..
- 2022 సంవత్సరపు రవాణా శాఖ గణాంకాల్లో వెల్లడి



హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వాహనదారులు

సాక్షి, విశాఖపట్నం: ద్విచక్ర వాహనాలపై హెల్మెట్ లేకుండా రయ్‌రయ్‌మంటూ దూసుకుపోతున్నారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్న నిబంధన ఉన్నా కొందరు వాటికి తిలోదకాలిస్తున్నారు. ఇలాంటి వారిలో యువకులే ఎక్కువగా ఉంటున్నారు. దూకుడుకు వీరు ప్రాణాలు పోగొట్టుకోవడమే కాదు.. ఎదుటి వ్యక్తుల ప్రాణాలను హరిస్తున్నారు. క్షతగాత్రులవుతున్న వారూ ఎందరో ఉంటున్నారు. రవాణా, పోలీసు శాఖల అధికారులు రహదారి భద్రత నిబంధనలను ఉల్లంఘించే వారిపై తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీల్లో హెల్మెట్ ధరించకుండా మోటారు బైకులను నడిపే వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. నిబంధనల మేరకు జరిమానా విధిస్తున్నారు. 2022లో విశాఖ జిల్లాలో రహదారి భద్రత నిబంధనలను ఉల్లంఘించిన 13,771 వాహనాలపై సంబంధిత అధికారులు కేసులు నమోదు చేశారు. వీటిలో హెల్మెట్ ధరించని వాహనదార్ల కేసులే 7,994 ఉన్నాయి. ఆ తర్వాత స్థానంలో డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా వాహనం నడిపిన కేసులున్నాయి. ఇలాంటి వారిపై 1,716 కేసులు నమోదు చేశారు. అలాగే వాహనాన్ని అధిక వేగంతో నడిపినందుకు 1,659 కేసులు, అధిక లోడుతో సరకు రవాణా చేసే వాహనాలు 987, సీటు బెల్టు ధరించకుండా వాహనాలు నడిపిన కేసులు 183, ప్రయాణికుల వాహనాల్లో ఓవర్ లోడుతో నడిపిన వారిపై 292 కేసులు, ఇతర కేసులు మరో 940 కేసులు నమోదయ్యాయి. ఈ లెక్కలను పరిశీలిస్తే మిగిలిన కేసులన్నిటికంటే హెల్మెట్ ఉల్లంఘన కేసులే అధికంగా ఉన్నట్టు తేలింది. కాగా హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహన ప్రమాదాల బారిన పడి మరణించిన వారు 2022 అక్టోబర్ వరకు 341 మంది ఉన్నారు.

నివారణ చర్యలు : ప్రమాదాల నివారణకు ప్రతి నెలా రహదారి భద్రతా కమిటీ సమావేశమవుతోంది. ఈ సమావేశంలో పోలీసు, రవాణా శాఖ అధికారుల సూచనల మేరకు రోడ్ల విస్తరణ, స్పీడు బ్రేకర్ల ఏర్పాటు, జంక్షన్లు, సర్వీసు రోడ్ల అభివృద్ధి, బ్లాక్ స్పాట్ల నివారణ వంటి చర్యలు తీసుకుంటున్నారు. అలాగే హెల్మెట్ ఆవశ్యకతపై కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. తరచూ అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నారు. మరోవైపు బుధవారం నుంచి ఈనెల 24 వరకు వారం రోజుల పాటు రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు.

బాధ్యతగా తీసుకోవాలి..



విశాఖను ప్రమాద రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తున్నాం. నిరంతరం ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహిస్తున్నాం. రహదారి భద్రతా నిబంధనల ఉల్లంఘనల వల్ల ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయి. మరెందరో ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రధానంగా హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. అతి వేగం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ప్రయాణిస్తూ ప్రమాదాల పాలవుతున్నారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నిబంధనలను పాటించడం బాధ్యతగా తీసుకోవాలి. అది జీవన విధానంగా మార్చుకోవాలి.

– జీసీ రాజారత్నం, రవాణా శాఖ ఉప కమిషనర్

వేడుకగా 'లోక్‌నాయక్' పురస్కారాల ప్రదానం



ఎన్టీరామారావు శతజయంతి పురస్కారాలను జయప్రద, జయసుధకు అందజేస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు, ఎంపీ ఎంవీవీ

బీచ్‌రోడ్డు: లోక్‌నాయక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఎన్టీఆర్ శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతి వార పత్రిక సంపాదకుడు వేమూరి బలరామ్‌కు లోక్‌నాయక్ ఫౌండేషన్ సాహిత్య పురస్కారం, నటీమణులు జయప్రద, జయసుధలకు ఎన్టీఆర్ శతజయంతి పురస్కారాలు, కూచిబొట్ల ఆనంద్, కోనేరు సత్యనారాయణ, గన్ని భాస్కరరావులకు లోక్‌నాయక్ ఫౌండేషన్ జీవన సాఫల్య పురస్కారాలను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రదానం చేశారు. కార్యక్రమంలో లోక్‌నాయక్ ఫౌండేషన్ చైర్మన్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు, నటుడు బ్రహ్మానందం, ఎంపీ ఎంవీవీ సత్యారాయణ, ఏయూ వీసీ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.



లోక్‌నాయక్ ఫౌండేషన్ జీవన సాఫల్య పురస్కారాలు అందుకున్న కూచుభట్ల ఆనంద్, గన్ని భాస్కరరావు, కోనేరు సత్యనారాయణ

మన పాఠశాలలు అదుర్స్..!



పెదగంట్యాడ మండలం నడుపూరు జెడ్పీ స్కూల్లో పరిశీలన చేస్తున్న అధికారుల బృందం



రైలు బోగీ మాదిరి ఉన్న తరగతి గది ప్రవేశ ద్వారం వద్ద విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటలక్ష్మి

- ఉమ్మడి విశాఖ జిల్లాలో 'పీఎం శ్రీ'కు అర్హత సాధించిన 678 పాఠశాలలు
- తొలి విడతలో మండలానికి రెండు స్కూళ్లు
- క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న అధికారులు

విశాఖ విద్య/పెదగంట్యాడ : ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు జాతీయ స్థాయి ప్రమాణాలతో ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ) పథకంలో చోటు దక్కించుకునేందుకు సై అంటున్నాయి. జిల్లా స్థాయి విద్యాశాఖాధికారులు ఇచ్చిన నివేదికల్లో వాస్తవికత ఎంతనేది పరిశీలన కోసం రెండు రోజులుగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న ఉన్నతాధికారులు ఇక్కడి స్కూళ్లను చూసి శభాష్ అంటున్నారు. విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటలక్ష్మి నేతృత్వంలోని అధికారులు బుధవారం పెదగంట్యాడ, గాజువాక మండలాల్లో పర్యటించారు. నడుపూరు, గంగవరం, అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూళ్లను పరిశీలించారు. పీఎం శ్రీ పథకం అర్హత కోసమని పాఠశాల నుంచి నమోదు చేసిన వివరాల మేరకు, వాటిలో వాస్తవికత ఎంతనేది స్వయంగా చూశారు. పాఠశాల రికార్డులను పరిశీలించి, ఉపాధ్యాయులు, విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులకు స్వీయ పరీక్ష నిర్వహించి, విద్యాబోధనలో నాణ్యతను తెలుసుకున్నారు. నాడు-నేడులో పాఠశాల అభివృద్ధి జరిగిన తీరును ఇక్కడి ఉపాధ్యాయులు అధికారులకు చూపించారు. రైలు బోగి మాదిరిగా ఉన్న తరగతి ప్రవేశ మార్గం వద్ద ఫొటోలు దిగారు. అందమైన పొదరిల్లు మాదిరే ఉన్న తరగతిని చూసి, బాగుందంటూ ఉపాధ్యాయులకు కితాబు ఇచ్చారు. ఎంఈవో పైడపునాయుడు అధికారులకు ఇక్కడి పరిస్థితులను వివరించారు.

అర్హత సాధించిన 678 స్కూళ్లు

పీఎం శ్రీ పథకంకు ఉమ్మడి విశాఖ జిల్లాలో 1,032 స్కూళ్లు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోగా, ఇందులో 678 జిల్లా స్థాయిలో అర్హత సాధించాయి. విశాఖలో 173, అనకాపల్లి -403, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 102 పాఠశాలలు జిల్లా స్థాయిలో అర్హత పొందాయి. వీటిలో మండలానికి రెండు స్కూళ్లు చొప్పున తొలివిడతలో ఎంపిక చేసే నిమిత్తం ఉన్నతాధికారుల బృందం మూడు జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తోంది.

ఎంపికైతే ప్రత్యేక నిధులు : పీఎం శ్రీ పథకంకు జిల్లా స్థాయిలో ఉన్నతాధికారుల బృందం ఎంపిక చేసిన ప్రభుత్వ స్కూళ్ల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయనుంది. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా విద్యారంగం అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చూపుతున్న ప్రత్యేక శ్రద్ధతో కేంద్రం సైతం ఏపీలోని స్కూళ్ల అభివృద్ధికి ఇతోధికంగా నిధులు ఇచ్చేందుకు ముందుకొస్తోంది. ఈ నేపథ్యంలోనే అధికారుల బృందం పాఠశాలలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తోందని పీఎం శ్రీ పథకంపై పర్యవేక్షణ చేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఏపీవో ఎ.శ్రీనివాసరావు తెలిపారు.

బావికొండ ⇄ శాలిహుండం

- బౌద్ధారామాల సందర్శనతో బుద్దిస్ట్ సర్క్యూట్
- రూ.2 కోట్లతో ఏర్పాటుకు పర్యాటక శాఖ ప్రణాళికలు
- పరిసరాల్లోని పర్యాటక ప్రాంతాలు సందర్శించేలా సన్నాహాలు
- ఆసక్తి వ్యక్తీకరణకు టెండర్లు ఆహ్వానించిన పర్యాటక శాఖ



బావికొండపై బౌద్ధ స్థూపాలు

సాక్షి, విశాఖపట్నం : అందాల విశాఖ జిల్లా పర్యాటక రంగంలో కొత్త పుంతలు తొక్కుతోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో ఉన్న ప్రధాన బౌద్ధారామాల్ని పూర్తి స్థాయి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా పర్యాటక శాఖ అధికారులు బౌద్ధారామాలకు సందర్శకుల సంఖ్య పెంచేందుకు వీలుగా బుద్దిస్ట్ సర్క్యూట్ ప్రాజెక్టు అమలు చేయాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి రూ.2 కోట్లతో రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్(ఆర్ఎఫ్‌పీ)కు టెండర్లు ఆహ్వానించారు.

బౌద్ధారామాలను కలుపుతూ..

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ప్రసిద్ధ బౌద్ధారామాలను కలుపుతూ బుద్దిస్ట్ సర్క్యూట్‌ను అమలు చేయాలని పర్యాటక శాఖ అధికారులు నిర్ణయించారు. జిల్లాలోని బావికొండ నుంచి శ్రీకాకుళం జిల్లా గార మండలంలోని శాలిహుండం, ఏలూరు జిల్లా కామవరపుకోటలోని గుంటుపల్లి, పల్నాడు జిల్లాలోని అమరావతి, బాపట్ల జిల్లా భట్టిప్రోలు బౌద్ధారామాల్ని సందర్శించేలా సర్క్యూట్ అభివృద్ధి చేయనున్నారు. ఆయా ప్రాంతాలకు చేరుకునేందుకు ఉండే సౌకర్యాల్ని పర్యాటకులకు వివరించనున్నారు. అదేవిధంగా.. ఆయా ప్రాంతాల్లోని బౌద్ధారామాలను సందర్శించిన తర్వాత సమీపంలో ఉన్న పర్యాటక ప్రాంతాలకు కూడా టూరిస్టులను తీసుకెళ్లే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఉదాహరణకు సర్క్యూట్‌లో భాగంగా బావికొండకు చేరుకున్న పర్యాటకులు.. ఆ ప్రాంతాన్ని సందర్శించిన తర్వాత సమీపంలో ఉన్న కైలాసగిరి, ఆర్‌కేబీచ్, రుషికొండ బీచ్, భీమిలి, సింహాచలం దేవాలయాల్ని సందర్శించేలా ఏర్పాట్లు చేస్తారు. అదేవిధంగా.. మిగిలిన బౌద్ధారామాల సమీపంలో ఉన్న టూరిస్ట్ ప్రాంతాలను పర్యాటకులు సందర్శించే విధంగా సర్క్యూట్ ఏర్పాటు చేసేందుకు ఆర్ఎఫ్‌పీ ఆహ్వానిస్తున్నారు. టెండర్లు దక్కించుకునే సంస్థ ఆయా బౌద్ధారామాల్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు.. అక్కడికి చేరుకునే సందర్శకులకు కనీస వసతులు కల్పించనుంది. అదేవిధంగా బౌద్ధ సమాజంతో ఏడాదికి రెండు సార్లు సమావేశాలు ఏర్పాటు చేయడంతో పాటు ధ్యానాలు నిర్వహించాలి. ఈ తరహాలో అభివృద్ధి చేస్తూ బుద్దిస్ట్ సర్క్యూట్‌ను వీలైనంత త్వరలో అమలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని పర్యాటక శాఖ అధికారులు చెబుతున్నారు.

21, 22 తేదీల్లో రత్నాచల్, సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లు పాక్షిక రద్దు

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): విజయవాడ-విశాఖపట్నం సెక్షన్ రేగుపాలెం-నర్సీపట్నం స్టేషన్‌ల మధ్య జరుగుతున్న ఆధునికీకరణ పనుల నేపథ్యంలో ఈ మార్గంలో ఈనెల 21, 22 తేదీల్లో పలు రైళ్లు పాక్షికంగా, కాకినాడ మెము (17267/17268) పూర్తిగా రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ త్రిపాఠి తెలిపారు. ఆ తేదీల్లో గుంటూరు-విశాఖపట్నం (17239/40) సింహాద్రి ఎక్స్‌ప్రెస్ సామర్లకోట వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో సామర్లకోట నుంచి గుంటూరుకు చేరుకుంటుంది. ఆ రెండు రోజులు ఈ రైలు సామర్లకోట-విశాఖపట్నం మధ్య రాకపోకలు సాగించదు. విజయవాడ-విశాఖపట్నం (12718) రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ తుని వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగుప్రయాణంలో తుని నుంచి విజయవాడకు చేరుకుంటుంది. ఆ రెండు రోజులు ఈ రైలు తుని-విశాఖపట్నం మధ్య రాకపోకలు సాగించదు.

ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి

జిల్లా వృత్తివిద్యాశాఖ అధికారి సత్యనారాయణ

మద్దిలపాలెం(విశాఖ తూర్పు): ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకులు, సిబ్బంది ప్రతిరోజూ తప్పనిసరిగా ముఖ ఆధారిత గుర్తింపు హాజరు నమోదు చేసుకోవాలని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి రాయల సత్యనారాయణ సూచించారు. డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి.. కళాశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులు పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయించాలని కళాశాల ప్రిన్సిపాల్ సుజాతను ఆదేశించారు. అనంతరం ల్యాబ్‌లను తనిఖీ చేశారు. ప్రాక్టికల్ పరీక్షలకు ల్యాబ్‌లను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలన్నారు. తర్వాత అధ్యాపకుల టీచింగ్ డైరీ, క్యాష్‌బుక్, సీఎంఆర్, సీఏఆర్, డైరీలను, ఓజేటీ రికార్డులను పరిశీలించారు. ల్యాబ్‌లో విద్యార్థుల హాజరు పట్టీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకులు, సిబ్బంది ఫేషియల్ రికగ్నైజేషన్ యాప్ ద్వారా ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వ్యక్తిగత హాజరు నమోదు చేసుకోవాలన్నారు. ఈ హాజరు ఆధారంగానే జీతాలు చెల్లింపులు ఉంటాయన్నారు. పెద్ద కళాశాలల్లో రెండు ల్యాబ్‌ల్లో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. మంచి ఫలితాలు సాధించేలా తర్ఫీదు ఇవ్వాలన్నారు. అనంతరం విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. పరీక్షలు బాగా రాయాలని సూచించారు.

రహదారి భద్రత..అందరి బాధ్యత



రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తూ.. హెల్మెట్లు ధరించి ర్యాలీ చేస్తున్న పోలీసులు, నగర యువత



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, డీసీపీ సుమిత్, డీటీసీ రాజారత్నం, సమాచార శాఖ జేడీ మణిరామ్

- కలెక్టర్ మల్లికార్జున
- రహదారి భద్రతా వారోత్సవాలు ప్రారంభం

మహారాణిపేట(విశాఖ దక్షిణ): వాహనచోదకులు రహదారి భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున పిలుపునిచ్చారు. కలెక్టర్ కార్యాలయం ఆవరణలో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో రహదారి భద్రతా వారోత్సవాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 24 రహదారి భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేకపోవడం వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా సీటు బెల్టు, హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనం నడిపినా, మైనర్లు వాహనాలు నడిపినా చట్ట రీత్యా నేరమన్నారు. 18 ఏళ్లు దాటిన వారంతా చట్టపరంగా మోటార్ వెహికల్ లైసెన్స్ తీసుకోవాలన్నారు. రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో సూచించిన అంశాల పరిష్కారానికి పలు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. చాలా చోట్ల బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి సేఫ్టీ స్పాట్స్‌గా మార్చినట్లు తెలిపారు. నగరంలో రోడ్లకు మరమ్మతులు చేస్తున్నట్లు చెప్పారు. ఈ వారోత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని.. రహదారి భద్రత, రోడ్డు ప్రమాదాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఉప రవాణా అధికారి రాజారత్నం, డీసీపీ సుమిత్, సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ వి.మణిరామ్, దిఎబిలిటీ పీపుల్ సంస్థ డైరెక్టర్ దిలీప్ పాత్రో పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సుల ఎంపిక నిలుపుదల

- తప్పులు తడకలతో తుది జాబితా
- అన్యాయం జరిగిందని నర్సుల నిరసన
- సిబ్బందిపై అవినీతి ఆరోపణలు
- 'సాక్షి'లో కథనంతో ఉలికిపాటు
- జాబితాను మళ్లీ పరిశీలిస్తున్న అధికారులు
- అర్హులకు అన్యాయం జరగదంటున్న ఆర్డీ

మహారాణిపేట(విశాఖ దక్షిణ): స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీ ప్రక్రియను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. ఎంపిక జాబితాలో తమకు అన్యాయం జరిగిందని నిరుద్యోగ నర్సులు, వెయిటేజీ మార్కులు కలపలేదని తాత్కాలిక ఉద్యోగులు బుధవారం కూడా తన నిరసన గళం వినిపించారు. దాదాపు 30 నుంచి 40 మందికి వెయిటేజ్ మార్కులు కలపలేదనే విషయం బయటకు రావడంతో.. ఈ జాబితాను పునఃపరిశీలన కోసం అధికారులు భర్తీ ప్రక్రియను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. స్టాఫ్ నర్సుల ఎంపికలో గందరగోళంపై బుధవారం 'సాక్షి'లో కథనం రావడంతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. తప్పుల తడకలతో కూడిన 172 మంది అభ్యర్థుల జాబితాను మళ్లీ పరిశీలన చేస్తున్నారు. కొంత మందికి అనవసరంగా ఎలా మార్కులు కలిశాయన్న దానిపై యంత్రాంగం దృష్టి పెట్టింది. అమరావతి నుంచి వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది విశాఖ చేరుకుని జాబితాను పరిశీలిస్తున్నారు.

స్టాఫ్ నర్సుల పోస్టుల కోసం ఇప్పటివరకు నాలుగు సార్లు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది జాబితాను తయారు చేశారు. ప్రభుత్వం జీవో ప్రకారం జాబితా తయారు చేశామని చెబుతున్నప్పటికీ.. ఎంపికలో సిబ్బంది అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అర్హులను తప్పించడం, అనర్హులను అందలం ఎక్కించడం కోసం సిబ్బంది చేతివాటం ప్రదర్శించారన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఎంపికైన 172 మందిలో 100 మంది సర్టిఫికెట్లను మంగళవారం పరిశీలించారు. బుధవారం మరో 30 మంది సర్టిఫికెట్ల పరిశీలన జరిగింది. జాబితాను పునఃపరిశీలన చేస్తున్న క్రమంలో ఇందులో ఎంత మంది పేర్లు ఉంటాయో.. ఊడతాయో మరి.! కాగా.. ఎంపిక జాబితా రూపొందించడంలో సిబ్బంది తీరుపై నిరుద్యోగులు మండిపడుతున్నారు. తమ జీవితాలతో సిబ్బంది చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకసారి మార్కులు కలపడం, మరోసారి తొలగించడం, ఎంపిక జాబితాలో కొందరి పేర్లు ఇప్పుడు తొలగించడం.. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పనితీరుకు అద్దం పడుతోందని పలువురు విమర్శిస్తున్నారు.

అభ్యర్థుల్లో ఉత్కంఠ : పోస్టుల సంఖ్య పెరగడం, కోవిడ్ సమయంలో పని చేసిన వారికి అదనపు మార్కులు కలపడం వంటి నిర్ణయాలు రావడంతో మెరిట్ లిస్ట్‌కు వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ ఉమా సుందరి ఆధ్వర్యంలో తుది మెరుగులు దిద్దుతున్నారు. అమరావతి నుంచి వచ్చిన వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది కూడా ఇందుకు సహకారం అందిస్తున్నారు. దీంతో కొత్త జాబితా కోసం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల అభ్యర్థులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. కాగా.. అర్హులకు అన్యాయం జరగదని డాక్టర్ ఉమా సుందరి హామీ ఇస్తున్నారు.

ప్రియంకు రజతం



విశాఖ స్పోర్ట్స్: అమెరికా కప్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో ఆర్టిస్టిక్ పోటీల్లో నగర స్కేటర్ ప్రియం రజత పతకాన్ని అందుకున్నాడు. ఫ్లోరిడా రాష్ట్రంలోని ఓర్లాండోలో ఈనెల 14 నుంచి 18 వరకు ఈ పోటీలు జరిగాయి. ఐస్ స్కేటింగ్‌తో పాటు పలు అంశాల్లో పాల్గొంటున్న ప్రియంకు ఇది పన్నెండో పతకం.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్స్ అయిన 1. శ్రీ బండారు పాండురంగ వెంకట నరసింహరాజు, 2. శ్రీమతి రుద్రరాజు సత్యవతి 3. శ్రీమతి నంబూరి సునీత 4. శ్రీమతి భూపతిరాజు సౌజన్యశాంతి 5. శ్రీమతి లతారుద్రరాజు 6. శ్రీ రుద్రరాజు వెంకట సాయి ఆదిత్యవర్మ వారు ఇచ్చిన బోగట్టా ప్రకారం ప్రజలు యావన్మందికి తెలియజేయునది ఏమనగా

ఈ క్రింది షెడ్యూలు దాఖాలా ఆస్తిని మా క్లయింట్స్ రిజిస్ట్రి దస్తావేజుల నెంబర్‌ల ద్వారా 2833/1998, 2834/1998, 1/1998, 645/1983, 648/1983, 573/1983, 574/1983, 575/1983, 572/1983, 576/1983, 646/1983, 14/2011, 15/2011 రిజిస్ట్రి చేసుకొని సంపూర్ణహక్కు అనుభవములో ఉన్నారు. కావున ఈ ఆస్తిపై మా క్లయింట్స్‌కు తప్ప మరెవరికీ ఎట్టి హక్కులు లేవు. ఈ షెడ్యూల్డు దాఖాలా ఆస్తిపై తనఖాలు విక్రయం, బహుమతులు, ప్రతిజ్ఞలు, ఛార్జీలు, బైండింగ్‌లు మొదలైనవి లేవని నా క్లయింట్స్ ధృవీకరిస్తూ హెచ్చరించినది ఏమనగా మా క్లయింట్స్‌కు తప్ప మరెవ్వరికి ఎట్టి హక్కులు లేని నష్టపోవుదరని మరియు మా క్లయింట్స్ హెచ్చరించదమైనది ఈ ఆస్తి విషయాలలో ఎటువంటి లావాదేవీలు చేసుకున్న యెడల నష్టపోవుదురనిన మరియు మా క్లయింట్స్ హక్కులను ఏవిధంగాను భంగిపజాలవు.

షెడ్యూల్డ్ ఆస్తి : పరవాడ మండలం తాడి శివారు, సాలపువాని పాలెం గ్రామం సర్వే నెం.1/3A లో గల AC3.48Cents మేరకు మెట్ట భూమి ఉత్తరం: బండారు మాధవిలత మరియు ఇతరులకు సంబంధించిన స్థలం దక్షిణం : NH5 రోడ్డు మరియు ఇతరుల స్థలం తూర్పు: సర్వే నెం. 1/4 స్థలం మరియు 30 అడుగులు పడమర: Honey Constructions మరియు ఇతరులకు సంబంధించిన భూమి

Kantamreddy Neelima Devi
Advocate
5-60/1/A, MIG-A-60, Sagarnagar, Visakhapatnam-45. Cell: 88860 06706

పదిలమైన ప్రణాళిక

- 10వ తరగతి పరీక్షలకు సన్నద్ధత
- ఆరు సబ్జెక్టులకు ఆరు పేపర్లతోనే పరీక్షలు
- ప్రశ్నాపత్రాలపై విద్యార్థులకు తర్ఫీదు
- మెరుగైన ఫలితాలు సాధించేలా తోడ్పాటు



మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్న ఉపాధ్యాయురాలు

విశాఖ విద్య: జిల్లాలో ఈ ఏడాది 10వ తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా విద్యాశాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. పరీక్షలను సమర్థవంతంగా ఎదుర్కొనేలా విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని 546 ఉన్నత పాఠశాలల్లో 36,407 మంది విద్యార్థులు 10వ తరగతి చదువుతున్నారు. ఇందులో ఎంతమంది పరీక్ష ఫీజు చెల్లించారనేది రెండు, మూడు రోజుల్లో లెక్కతేలనుంది. ఈ నెల 20 వరకు నామినల్ రోల్ తప్పిదాల సవరణకు అవకాశం ఇచ్చినందున, ఆ తర్వాత పరీక్షలకు ఫీజు చెల్లించిన విద్యార్థుల జాబితాను అధికారులు ప్రకటించనున్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ఫోకస్

పరీక్షలకు మరో రెండున్నర నెలలు మాత్రమే మిగిలి ఉండటంతో డీఈవో ఎల్. చంద్రకళ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పాఠశాలల హెచ్‌ఎంలకు దిశానిర్దేశం చేశారు. ఫార్మేటివ్, సమ్మెటివ్ పరీక్షల్లో సాధించిన మార్కుల ఆధారంగా విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేశారు. విద్యార్థులను ఏ,బీ, సీ, డీ గ్రూపులుగా విభజించారు. సీ, డీ గ్రూపుల్లో ఉన్న విద్యార్థులపై ఫోకస్ పెట్టారు. సబ్జెక్టు ఉపాధ్యాయులు వీరిని దత్తత తీసుకున్నారు. చదువుల్లో ముందుకుతీసుకొచ్చేలా బాధ్యత వహిస్తున్నారు. ప్రతీ విద్యార్థి మంచి మార్కులతోఉత్తీర్ణులయ్యేలా తగిన కార్యాచరణతో ముందుకెళ్తున్నారు.

ప్రత్యేక స్టడీ మెటీరియల్ అందజేత

ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసే క్రమంలో రెగ్యులర్ తరగతులతో పాటు, ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ఒక గంట స్పెషల్ క్లాసులు నిర్వహిస్తున్నారు. ప్రశ్నాపత్రం నమూనా మేరకు ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులు సబ్జెక్టు వారీగా తయారు చేసిన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందజేశారు.

పరీక్షలపై అవగాహన

ఈ ఏడాది 100 మార్కుల ప్రశ్నాపత్రాలతో ఆరు సబ్జెక్టులకు ఆరు పేపర్లు మాత్రమే ఉంటాయి. గతేడాది బయాలజికల్ సైన్స్, ఫిజికల్ సైన్సుకు వేర్వేరు పేపర్లు ఉండేవి. కానీ ఈ ఏడాది రెండు కలిపి ఒకే పేపరుగా మార్పు చేశారు. అయితే బయాలజికల్ సైన్సు, ఫిజికల్ సైన్సుకు కలిపి ఒకే పేపరు ఇస్తున్నప్పటికీ, వీటికి ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా జవాబులు రాసేందుకు రెండు బుక్‌లెట్‌లను అందించనున్నారు. 10వ తరగతి పరీక్షల విభాగం ఉన్నతాధికారులు ప్రకటించిన ప్రశ్నాపత్రాల నమూనా మేరకు, విద్యార్థులకు వాటిపై తగిన అవగాహన కల్పిస్తున్నారు.

పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నాం



10వ తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నాం. ఈ సారి ఆరు పేపర్లు మాత్రమే ఉంటాయి. దీనిపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా ఉపాధ్యాయులకు ఆదేశాలిచ్చాం. ఈ విషయంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలి. పరీక్ష కేంద్రాల గుర్తింపుపై దృష్టి పెట్టాం.

– ఎస్.మురళీ మోహన్, అసిస్టెంట్ కమిషనర్, ప్రభుత్వ పరీక్షల విభాగం

నంబర్ వన్ లక్ష్యం



10వ తరగతి ఫలితాల్లో గతేడాది మా విద్యార్థి జీవీఎంసీ పరిధిలో టాపర్‌గా నిలిచింది. 75 శాతం ఉత్తీర్ణతతో మా పాఠశాల రెండో స్థానం సాధించింది. ఉపాధ్యాయులంతా ఎంతో శ్రద్ధ తీసుకుని, ప్రతీ విద్యార్థిపై ఫోకస్ పెడుతున్నారు. మా టీచర్లు సొంత మెటీరియల్ సిద్ధం చేసి విద్యార్థులకు అందజేశారు. ఈ సారి నంబర్ వన్ స్థానం సాధిస్తాం.

– డి.శాంతి కుమారి, హెచ్‌ఎం, ముధరానగర్

బరువెక్కిన గుండెలతో..

దివంగత తులసీరావుకు ఘన నివాళి



తులసీరావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు, దాడి వీరభద్రరావు

యలమంచిలి: విశాఖ డెయిరీ చైర్మన్‌గా తమ కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన తులసీరావు మరణాన్ని రైతులు, అభిమానులు జీర్ణించుకోలేక పోతున్నారు. యల మంచిలిలో బుధవారం నిర్వహించిన సంస్మరణ సభకు పెద్ద ఎత్తున తరలివచ్చి, ఆయనతో తమకున్న జ్ఞాపకాలను గుర్తు చేసుకుని, బరువైన గుండెలతో నివాళులర్పించారు. రైతుల నుంచి అమాత్యుల వరకూ రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో యలమంచిలి తరలివచ్చారు. తులసీనగర్‌లో ఉన్న ఆడారి తులసీరావు నివాసంలో ఆయన చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. ఇంటి వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఎమ్మెల్యే కన్నబాబు, మాజీ ఎమ్మెల్యే దాడి వీరభద్రరావు ఆవిష్కరించారు.

తరలివచ్చిన ప్రముఖులు : దివంగత విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు సంస్మరణ సభకు వెల్లువలా జనం, నాయకులు తరలివచ్చారు. టీటీడీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, రాష్ట్ర మంత్రులు బూడి ముత్యాల నాయుడు, గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, డిప్యూటీ సీఎం కొలగట్ల వీరభద్రస్వామి, మాజీ మంత్రులు కురసాల కన్నబాబు, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు తిప్పలనాగిరెడ్డి, యు.వి. రమణమూర్తిరాజు, శంబంగి చిన అప్పలనాయుడు, మాజీ ఎమ్మెల్యేలు దాడి వీరభద్రరావు, రెహ్మాన్, మళ్ల విజయ ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు చొక్కాకుల లక్ష్మి, వెంకట్రావ్, బొద్దపు యర్రయ్య, ఆడారి చిన్న, ఆడారి వెంకట్, గొంతిన నాగేశ్వరరావు, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ, టీడీపీ నేతలు, మాజీ మంత్రులు పప్పల చలపతిరావు, గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్యే గణబాబు యలమంచిలి వచ్చారు. తులసీరావు విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆడారి తులసీరావు కుమారుడు ఆనంద్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారిని పరామర్శించారు.

తులసీరావుకు డెయిరీ కార్మికుల నివాళి

అక్కిరెడ్డిపాలెం: విశాఖ డెయిరీ చైర్మన్ దివంగత ఆడారి తులసీరావు వేలాది జీవితాల్లో వెలుగులు నింపారని డెయిరీ వర్గాలు పేర్కొన్నాయి. నాతయ్యపాలెంలోని విశాఖ డెయిరీ వద్ద బుధవారం నిర్వహించిన తులసీరావు సంస్మరణ కార్యక్రమంలో డెయిరీ అధికారులు, కార్మికులు పాల్గొన్నారు. ఆయన చిత్రపటం వద్ద ఘన నివాళులర్పించారు.

25న వీఎంఆర్‌డీఏ ప్లాట్లకు ఈ వేలం

దొండపర్తి(విశాఖ దక్షిణ): వీఎంఆర్‌డీఏ గతంలో అభివృద్ధి చేసిన లేఅవుట్లలో ఖాళీ ప్లాట్ల విక్రయానికి ఈ నెల 25వ తేదీన ఈ–వేలం నిర్వహించనున్నట్లు వీఎంఆర్‌డీఏ కార్యదర్శి టి.వేణుగోపాల్ తెలిపారు. కూర్మన్నపాలెం ఫేజ్–1, 2, 6, పెదగంట్యాడలో ఫేజ్–1, 2, 3, మర్రిపాలెం లేఅవుట్, మధురవాడ సైబర్ వ్యాలీ, చిలుకూరి జాయింట్ వెంచర్, డాక్టర్ పద్మావతి జాయింట్ వెంచర్, విజయనగరంలో కణపాక అయ్యన్నపేట లేఅవుట్లలో నివాస అవసరాలకు అనువైన ఎల్ఐజీ, ఎంఐజీ, హెచ్ఐజీ ప్లాట్లను విక్రయించనున్నట్లు వెల్లడించారు.

ఈ నెల 23వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా ఈ–పోర్టల్ https://konugolu.ap.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ పోర్టల్‌లో నమోదు చేసుకొనేందుకు అవగాహన లేని వారి కోసం వీఎంఆర్‌డీఏ ప్రధాన కార్యాలయం 3వ అంతస్తులో సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

సోనోవిజన్‌లో కొనుగోలుదారుడికి హోండా అమేజ్



సోనోవిజన్ షోరూంలో లక్కీ డ్రా తీస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

దొండపర్తి(విశాఖ దక్షిణ): సోనోవిజన్ సంక్రాంతి సేల్ లక్కీ డ్రాలో ఎంవీపీ కాలనీకి చెందిన కొనుగోలుదారుడు ఎం.సూర్యనారాయణ హోండా అమేజ్ కారును గెలుచుకున్నాడు. సంక్రాంతి సందర్భంగా విశాఖ సోనోవిజన్ షోరూంలలో ఎలక్ట్రానిక్ ఉపకరణాలను కొనుగోలు చేసిన వారికి లక్కీ డ్రా బహుమతులుగా హోండా అమేజ్ కారు, ఎల్ఈడీ టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషీన్లను ప్రకటించారు. దీని ప్రకారం డైమండ్ పార్క్ వద్ద సోనోవిజన్ షోరూంలో లక్కీ డ్రా నిర్వహించారు. విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కొనుగోలుదారుల సమక్షంలో డ్రా తీసి విజేతలను ప్రకటించారు. ఇందులో ఎంవీపీ కాలనీ సెక్టర్–6కు చెందిన ఎం.సూర్యనారాయణ(కూపన్ నెంబర్–114279) హోండా అమేజ్ కారును గెలుచుకున్నారు. అలాగే ఎల్ఈడీ టీవీని సాగర్‌నగర్ ప్రాంతానికి చెందిన సి.హెచ్.సత్యవతి(కూపన్ నెంబర్–919592), రిఫ్రిజిరేటర్‌ను అక్కయ్యపాలెంకు చెందిన ఎస్.వెంకటరమణ(కూపన్ నెంబర్–059874), వాషింగ్ మెషీన్‌ను అల్లిపురానికి చెందిన కె.సౌందర్య(కూపన్ నెంబర్–142717) గెలుచుకున్నారు. సోనోవిజన్ అందరి కన్నా తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్ అందిస్తూ ఏపీలో అతి పెద్ద ఎలక్ట్రానిక్ స్టోర్‌గా అవతరించిందని సంస్థ మేనేజింగ్ పార్టనర్ పి.భాస్కరమూర్తి పేర్కొన్నారు.

చీటీల మోసం కేసులో ఇద్దరికి రెండేళ్ల జైలు

అక్కిరెడ్డిపాలెం(గాజువాక): అధిక వడ్డీ ఇస్తామని చీటీలు కట్టించి.. ఆ తర్వాత మోసగించిన కేసులో ఇద్దరికి న్యాయమూర్తి రెండేళ్ల జైలు శిక్ష విధించారు. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలివీ.. 2010లో గాజువాకకు చెందిన సరిసా జగన్నాథం, కాశిరెడ్డి వెంకట అప్పారావులు అధిక వడ్డీ ఇస్తామని అదే ప్రాంతానికి చెందిన జహరున్నీసా బేగంతో పాటు హైస్కూల్‌కు చెందిన కొందరు వ్యక్తులతో చీటీలు కట్టించారు. వారు మోసం చేయడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ దాలిబాబు కేసు నమోదు చేసి విచారణ జరిపారు. ఈ కేసులో నిందితులకు 8వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ యార్లగడ్డ శ్రీలక్ష్మి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DISTANCE EDUCATION

- ఆంధ్ర యూనివర్శిటీ దూర విద్య ద్వారా B.A., B.Com., B.Sc., M.A., M.Com., M.B.A., M.C.A., M.H.R.M పూర్తి చేయవచ్చును. 100% Results. Dip., B.Tech, M.Tech, Para Medical కోర్సులు Lateral Entry One Sitting ద్వారా పూర్తి చేయవచ్చు. ఫోన్ : 93939 88895, 97010 39939 [V- 775018]

Real Estate

LEASE

- Warehouse Available for Lease near Lanchester Road, Guntur, 16000 Sft. Space Situated on 7000 Sq. yards Land. Cont.: 8790205228. [HA-3268]

Services

GOLD LOANS

- లోకేష్ గోల్డ్ లోన్స్ :– బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :– 98484 88068/ 77992 23300 [V- 3024]

Wanted

- రామ టాకీస్ ఏరియా ఆఫీసులో వర్క్ చేయుటకు రిసెప్షనిస్ట్, కంప్యూటర్ ఆపరేటర్స్, టెలీ కాలర్స్, లేడీ మేనేజర్, ప్యాకింగ్ గర్ల్స్ కావలెను. డైరెక్ట్ జాబ్స్ జీతం : 12 K to 25 K. ఫోన్ : 81253 60910 [V-776966]
- ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రసులు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10–15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-776041]
- ఇంట్లోఉండి ఇంటి పని / వంట పని చేయుటకు లేడీస్ కావలెను. జీతం : 10,000/– కుమార్, ద్వారకనగర్, విశాఖ. ఫోన్ : 94408 02456, 94408 02452. [V-689]
- మధురవాడ దగ్గరలో సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం : 15 వేలు, డ్యూటీ 8 గం॥లు. వయస్సు : 50 వరకు. ఫోన్ : 97057 67888, 88858 68111 [V-1704]

CHANGE OF NAME

I, **JAYESHKUMAR LALJIBHAI PATEL** S/o. Laljibhai Patel, Residing at Flat No. 303, Goutham Radhakrishna Gardens, 49-51-1C, Shanthipurm, Vizag - 530016, have changed my name **JAYESHKUMAR LALJIBHAI PATEL** (Old Name) to **JAYESH LALJIBHAI PATEL** (New Name) Hence after, all documents will continue with new name **JAYESH LALJIBHAI PATEL**.

- విశాఖపట్నం పోర్ట్‌లో పనిచేయుటకు చదువుకున్న సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 8 లేదా 12 గంటలు డ్యూటీ, జీతం : 9,000/– నుండి 14,000/–. ఫోన్ : 90142 40367, 83093 64893 [V-6041]
- విశాఖపట్నంలో SBS నందు పనిచేయుటకు టూ వీలర్ కలిగిన మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కావలెను. 9949445899, 9398820227 [G-1038]
- ప్రముఖ కంపెనీకి మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్‌టైం 1గం॥ పోస్టల్ కవర్స్‌పై అడ్రసులు వ్రాయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. కాల్/వాట్సప్. 9704987227 [G-776027]
- Wanted Vice Principals, Marketing Incharges, Counsellors, Female Tele Callers. Salary: Negotiable. Qualification Any Degree. Job Location: Vizag & Gajuwaka. Contact: 9989893943, 8008556073 [G-3871]
- హైదరాబాద్‌లోని అప్తా హోంకేర్‌లో వృద్ధులను చూసుకోవడానికి 21-45 వయసు గల M/F Caretaker కావలెను. జీతం: 16-18 వేలు, భోజనం, వసతి, ఇన్సూరెన్సు గలవు. 9381848549 / 6300813664 [G-350]
- అంజన్న హోమ్‌కేర్ పెద్దవారికి పేషెంట్ కేర్/ఇంటి/వంటపని చేయుటకు ఆయాలు, వార్డ్‌బాయ్స్, Exp, ఫ్రీ/పు/నర్సులు కావలెను. జీతం: 18,000/– నుండి 25,000/– వరకు ఇవ్వబడును. కూకట్‌పల్లిలో Hyd. Ph: 9966568882, 9963489661 [HA-900]
- షిర్డీ సాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ వార్డెన్స్, లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-10046]
- హైదరాబాద్‌లో 5 స్టార్ హోటల్‌లో పనిచేయుటకు క్యాటరింగ్ బాయ్స్ & హౌస్‌కీపింగ్ బాయ్స్ కావలెను జీ: 19వే - 27 వేల రూం + మీల్స్ ఫ్రీ Age: 18-28 డైరెక్ట్ జాబ్, ఎటువంటి విద్యార్హతలు లేదు మగవారికి మాత్రమే. Ph: 83330 03754 / 86398 79970 [H-792778]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి

మురళీనగర్, మాధవధార	90101 33346
NAD, కంచరపాలెం	90108 10033
గోపాలపట్నం, పెందుర్తి	70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్	90100 55116
డాబాగార్డెన్స్, జగదాంబ, MVP కోలనీ, మద్దిలపాలెం	90101 96663
గాజువాక	97059 33394

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

టన్నెల్ అక్వేరియం అద్భుతం

ట్విట్టర్ వేదికగా ప్రశంసించిన ఎంపీ విజయసాయి రెడ్డి



ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం కన్వెన్షన్ సెంటర్‌కు చేరువలో ఏర్పాటు చేసిన అండర్ వాటర్ టన్నెల్ అక్వేరియం విశాఖ నగరానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని ఎంపీ వి.విజయసాయిరెడ్డి ట్విట్టర్ వేదికగా అభినందించారు. సముద్రం, మంచినీటిలో జీవించే 500లకు పైగా రకాల చేపలు ఇందులో ప్రదర్శించడం, సింగపూర్ తరహాలో ఇది నిలుస్తుందని పేర్కొన్నారు.

సింహాద్రిలో విద్యుదుత్పత్తికి అంతరాయం

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో మూడో యూనిట్‌లో బుధవారం విద్యుదుత్పత్తికి అంతరాయం ఏర్పడింది. 500 మెగావాట్ల సామర్థ్యం గల మూడో యూనిట్‌లో బుధవారం మధ్యాహ్నం 4 గంటల సమయంలో బ్రాయిలర్‌లో అమర్చిన ట్యూబుకు రంధ్రం ఏర్పడి లీకేజీ ఏర్పడింది. దీంతో విద్యుదుత్పత్తికి అంతరాయం కలిగింది. సమస్యను గుర్తించిన సాంకేతిక నిపుణులు మరమ్మతులు చేపడుతున్నారు. శుక్రవారం ఉదయానికల్లా యూనిట్ నుంచి విద్యుదుత్పత్తిని పునరుద్ధరించే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం సంస్థలో 1, 2, 4 యూనిట్లు యథావిధిగా పనిచేస్తున్నాయని సంస్థ అధికారులు వెల్లడించారు.

మత్తుపదార్థాల కలకలం



స్వాధీనం చేసుకున్న మత్తు ఇంజక్షన్లు

కూర్మన్నపాలెం(గాజువాక): జీవీఎంసీ 88వ వార్డు పరిధి యాదవజగ్గరాజుపేటలో మత్తు పదార్థాలు విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 35 మత్తు ఇంజక్షన్లు, గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలివీ.. యువకులు గంజాయి, మత్తు పదార్థాలు వినియోగిస్తూ దొంగతనాలకు పాల్పడుతున్నారని, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవరిస్తున్నారని స్థానిక ప్రజలు ఇటీవల దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు బుధవారం యాదవజగ్గరాజుపేటలోని అపెరల్ పార్కు రోడ్డు మధ్యలో ఉన్న స్క్రాప్ దుకాణంపై దాడి చేశారు. ఇక్కడ గంజాయి విక్రయిస్తున్న వడ్లపూడి గాంధీబొమ్మ సెంటర్‌కు చెందిన నక్కా మహేశ్వరరెడ్డితో పాటు అతనికి సహకరించిన మండి చైతన్య, వాసా శ్రీరామరెడ్డిలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 35 పెంటాజోసిన్ లాక్టేట్ ఇంజక్షన్లు, నాలుగు గంజాయి ప్యాకెట్లు(20 గ్రాములు), ఒక మొబైల్ ఫోన్, రూ.800 స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు మహేశ్వరరెడ్డి పశ్చిమ బెంగాల్‌కు చెందిన అనుపమ్ అధికారి నుంచి పెంటాజోసిన్ లాక్టేట్ అనే మత్తు ఇంజక్షన్లను రూ.30 కొనుగోలు చేసి.. వాటిని చైతన్య, శ్రీరామరెడ్డిలకు రూ.100 చొప్పున విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. వారు వాటిని రూ.200 నుంచి రూ.300 వరకు యువకులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గాజువాక ఏసీపీ త్రినాథ్, దువ్వాడ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిందితులను విచారించి వివరాలు సేకరించారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న మరో నిందితుడు అనుపమ్ అధికారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

జూ పార్కు సంక్రాంతి ఆదాయం రూ.15.76 లక్షలు

ఆరిలోవ(విశాఖ తూర్పు): జూ పార్కుకు సంక్రాంతి సందర్భంగా సందర్శకుల తాకిడి కనిపించింది. నాలుగు రోజులు పాటు వేలాది మంది సందర్శకులు జూ పార్కును సందర్శించడంతో రూ.లక్షల్లో ఆదాయం లభించింది. ఈనెల 14న భోగి నాడు 4,432 మంది సందర్శించగా వారి నుంచి రూ.3,04,572 ఆదాయం లభించింది. 15న సంక్రాంతి నాడు 7,381 మంది సందర్శకుల ద్వారా రూ.4,58,635 లభించింది. సోమవారం సాధారణంగా జూపార్కుకు సెలవు కావడంతో దాని ప్రభావం మరుసటి రోజు ముక్కనుమ నాడు కనిపించింది. ఆ రోజు 9,306 మంది సందర్శకులు సందర్శించగా రూ.5,36,595 ఆదాయం చేకూరింది. బుధవారం కూడా 5,169 మంది జూ పార్కును సందర్శించగా వారి ద్వారా రూ.2,76,217 ఆదాయం లభించింది. ఈనెల 14, 15, 17, 18 తేదీల్లో 26,288 మంది జూ పార్కును సందర్శించగా.. వారి ద్వారా రూ.15,76,019 ఆదాయం లభించినట్లు జూ అధికారులు తెలిపారు.

భద్రతకు భరోసా

- మహిళలు, బాలలు, రోడ్, సైబర్ సేఫ్టీపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి
- నేర నియంత్రణతో పాటు పారిశ్రామికీకరణ భద్రతకు రక్షణ చర్యలు
- సీసీ టీవీ, సైబర్ ల్యాబ్ వంటి ఆధునిక రక్షణ వసతుల ఏర్పాటు
- విశాఖ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్(వీసీఎస్‌సీ) ఏర్పాటుకు సీపీ శ్రీకాంత్ చొరవ

దొండపర్తి(విశాఖ దక్షిణ): విశాఖను సురక్షిత నగరంగా తీర్చిదిద్దేందుకు నగర పోలీస్ శాఖ కసరత్తు చేస్తోంది. నేర నియంత్రణతో పాటు ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఆధునిక, సాంకేతికతతో నగరంలో నిఘా వ్యవస్థను మరింత పటిష్ట పరిచేందుకు సమాయత్తమవుతున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా సొసైటీ ఫర్ విశాఖ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్(వీసీఎస్‌సీ) ఏర్పాటుకు నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ సంసిద్ధమవుతున్నారు. ఇందుకోసం పరిశ్రమలు, ఐటీ, హెల్త్‌కేర్, ఫార్మా, రియల్ ఎస్టేట్, హాస్పిటాలిటీ వంటి పలు రంగాలకు చెందిన ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమై ప్రశాంత విశాఖకు చేపట్టాల్సిన చర్యలపై చర్చిస్తున్నారు.

కాస్మోపాలిటన్ సిటీగా..

విశాఖ పారిశ్రామిక, ఐటీ, పర్యాటక ఇలా అన్ని రంగాల్లో విశేషాభివృద్ధి దిశగా పయనిస్తోంది. దేశ విదేశాల నుంచి పెద్ద ఎత్తున పరిశ్రమలు నగరానికి తరలివస్తున్నాయి. అలాగే విశాఖ అందాలను తిలకించేందుకు విదేశీ పర్యాటకులు సైతం ఆసక్తి చూపిస్తున్నారు. అన్ని రంగాల్లో దూసుకుపోతున్న విశాఖ కాస్మోపాలిటన్ సిటీగా రూపాంతరం చెందుతోంది. సిటీ ఆఫ్ డెస్టినీగా పేరుపొందిన విశాఖను ప్రశాంత నగరంగా తీర్చిదిద్దేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకుంటూనే.. సాంకేతికత ఆధారంగా నగరంలో పటిష్ట నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది.

కొత్తగా వీసీఎస్‌సీ ఏర్పాటుకు చర్యలు

నగరంలో నేర నియంత్రణ కోసం ఇప్పటికే ప్రధాన జంక్షన్లు, ప్రాంతాల్లోనే కాకుండా కాలనీల్లో కూడా పోలీస్ శాఖతో పాటు జీవీఎంసీ కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాయి. కమాండ్ కంట్రోల్ రూం ద్వారా వీటన్నింటిపై పోలీసులు నిరంతరం నిఘా పెడుతూనే ఉన్నారు. అయితే నగర పరిధి విస్తరిస్తుండడం, కొత్తగా పరిశ్రమలు ఏర్పాటవుతుండడం, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు విశాఖకు వస్తుండడంతో మరింత భద్రతా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పోలీస్ శాఖ గుర్తించింది. దీనికి అనుగుణంగా నిఘా వ్యవస్థను మరింత విస్తృతం చేయాలని నిర్ణయించింది. దీనికి పరిశ్రమలు, వ్యాపార సంస్థలు, ప్రజల నుంచి సహాయ సహకారాలు అవసరమన్న విషయాన్ని అన్ని వర్గాల వారికి అవగాహన కలిగిస్తున్నారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో ముఖ్యంగా మహిళలు, పిల్లల భద్రత, రోడ్ సేఫ్టీ, సైబర్ సేఫ్టీ, క్రైం మానిటరింగ్ వంటి రక్షణ చర్యలను మరింత పకడ్బందీగా అమలయ్యే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని పోలీస్ కమిషనర్ శ్రీకాంత్ నిర్ణయించారు. ఇందుకోసం సీసీటీవీ, సైబర్ ల్యాబ్ వంటి సాంకేతికతను పెంపొందించేందుకు సొసైటీ ఫర్ విశాఖపట్నం సిటీ సెక్యూరిటీ కౌన్సిల్(వీసీఎస్‌సీ) ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఐటీ, ఫార్మా, ఇండస్ట్రీస్, ఇలా అన్ని రంగాల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి విశాఖ భద్రతకు ఆయా రంగాలు, సంస్థలు, వ్యాపారులు చేపట్టాల్సిన చర్యలను వారికి వివరించారు. అందరి సహకారంతోనే నేర నియంత్రణ సాధ్యమవుతుందని వారికి స్పష్టం చేశారు.

సాంకేతికతతో నేరాలకు అడ్డుకట్ట

నేర నియంత్రణకు సాంకేతికత దోహద పడుతుంది. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని నిఘా వ్యవస్థను మరింత పటిష్ట పరుచుకోవాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం ప్రభుత్వం, పోలీస్ శాఖ చేపట్టాల్సిన అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతోంది. అలాగే సంస్థలు, వ్యాపారుల నుంచే కాకుండా ప్రజల నుంచి కూడా సహాయ సహకారాలు అవసరం. ఇందుకోసం సొసైటీ ఫర్ విశాఖపట్నం సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ ఏర్పాటు చేసి అందులో అందరి భాగస్వామ్యం అవసరమన్న విషయాన్ని తెలియజేస్తున్నాం.

– సిహెచ్.శ్రీకాంత్, విశాఖ పోలీస్ కమిషనర్

నగర సుందరీకరణకు ప్రాధాన్యం

- పకడ్బందీగా పారిశుధ్య నిర్వహణ
- సమీక్షలో జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

అల్లిపురం(విశాఖ దక్షిణ): నగర సుందరీకరణతో పాటు పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు ఉన్నతాధికారులను ఆదేశించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం ఉన్నతాధికారులతో వివిధ అంశాలపై కమిషనర్ సమీక్ష నిర్వహించారు. నగరంలో పారిశుధ్య పనులు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రధాన కాలువల్లో అడ్డంకులు తొలగించాలని, ఖాళీ స్థలాలు, రోడ్ల మార్జిన్, చెత్త పడే ప్రదేశాల్లో అవసరాన్ని బట్టి డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలన్నారు. రోడ్లు, కాలువల్లో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రజారోగ్య అధికారులను, పందుల లేకుండా చర్యలు చేపట్టాలని సిటీ వెల్ఫేర్ డాక్టర్ ఎన్.కిశోర్‌ను ఆదేశించారు. ప్రధాన కాలువలు, భూగర్భ డ్రైనేజీలు పొంగకుండా దిగువస్థాయి సిబ్బందితో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని పర్యవేక్షక ఇంజనీర్ కె.వి.ఎన్ రవిను సూచించారు. రోడ్లు, ఫుట్‌పాత్‌లపై దృష్టిసారించి వాటికి మరమ్మతులు చేపట్టాలన్నారు. జోనల్ కమిషనర్లందరూ సర్వైలెన్స్‌తో తిరుగుతూ ఉండాలని, ప్లాస్టిక్ బ్యానర్ల నిషేధంపై దుకాణదారులు, ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన కల్పించాలన్నారు. టాస్క్‌ఫోర్స్‌కు వచ్చే ఫిర్యాదులకు వెనువెంటనే పరిష్కరించాలని జోనల్ కమిషనర్లను ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న ప్రతి భవనానికీ ప్లాను ఉండేలా చూడాలని, గెడ్డలు, కాలువలు, ప్రభుత్వ స్థలాలు, రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

నగర సుందరీకరణకు ప్రాధాన్యమిస్తూ పార్కులు, రోడ్ల మార్జిన్లు, సెంట్రల్ మీడియన్లలో మొక్కలను ట్రిమ్మింగ్ చేసి అందంగా ఉంచాలన్నారు. మొక్కలు ఎండిపోకుండా తగిన చర్యలు చేపట్టాలని డీడీ(ఉద్యానవన శాఖ) ఎం.దామోదరరావును ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, ఎస్ఎస్ వర్మ, డాక్టర్ వి.సన్యాసిరావు, జేడీ (అమృత్) విజయ భారతి, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కె.ఎస్.ఎల్.జి శాస్త్రి, సెక్రటరీ నల్లనయ్య, జోనల్ కమిషనర్లు, పర్యవేక్షక ఇంజినీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఐవీఎఫ్ సెంటర్లు నిబంధనలు పాటించాలి

మహారాణిపేట(విశాఖ దక్షిణ): జిల్లాలోని అన్ని ఐవీఎఫ్ సెంటర్లు ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. బుధవారం తన కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అధ్యక్షతన అసిస్టెంట్ రీప్రొడెక్టివ్ టెక్నాలజీ(ఏఆర్‌టీ)/సరోగసీ ఫెర్టిలిటీ సెంటర్ల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజులు విషయంలో పేదవారిని దృష్టిలో పెట్టుకోవాలన్నారు. సరోగసీ సెంటర్లు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. స్కానింగ్ విషయంలో కూడా నియమాలు పాటించాలన్నారు. సమావేశంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, వైద్యులు, ఐవీఎఫ్ వైద్యులు పాల్గొన్నారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.56,730
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.52,000
వెండి(కిలో):	రూ.74,800

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	రూ.120
స్కిన్	రూ.210
స్కిన్‌లెస్	రూ.220

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	575.00
విజయనగరం	579.00
శ్రీకాకుళం	579.00